క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



సిరికొండ: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్‌లో శుక్రవారం కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు వంచ భాస్కర్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే కేవీఆర్‌కు సన్మానం



సిరికొండ: కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డిని మండలంలోని తూంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు శుక్రవారం కలిశారు. ఇద్దరు రాష్ట్ర స్థాయి నేతలపై విజయం సాధించినందుకు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రాజేందర్, గంగాధర్, రాజేశ్వర్, సాగర్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీపీసీఏ వ్యవస్థాపకుడు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర నూతన ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు శుక్రవారం టీపీసీఏ వ్యవస్థాపకుడు, గౌరవ అధ్యక్షుడు తిరువరంగం ప్రభాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు టి కేశవ్‌కుమార్ తదితరులున్నారు.

పీఆర్‌టీయూ పత్రిక సంపాదక సభ్యుడిగా జలంధర్



పెంట జలంధర్

నిజామాబాద్‌అర్బన్: పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం పత్రిక సంపాదక వర్గ సభ్యుడిగా పెంట జలంధర్ నియమితులయ్యారు. జిల్లా పీఆర్‌టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని నియామకాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా శంకర్, జిల్లా సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా మురళి, నిజామాబాద్ డివిజన్ అధ్యక్షుడిగా తుమ్మల ప్రవీణ్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి నియామకమయ్యారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్ పటేల్, గోపాల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: బోర్గాం(పి) ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ నాయకులు జన్నారపు రాజేశ్వర్, మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఫుడ్‌పాయిజన్ ఘటనలు తరచూ జరుగుతున్నా అరికట్టడంతో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. నాయకులు మనోజ్, రవి తేజ, రాజు, వంశీ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల సర్వ సభ్య సమావేశం సాదా సీదాగా జరిగింది. శుక్రవారం ఎంపీపీ గౌతమి అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరై తమ పురోగతి నివేదికలను చదివి వినిపించారు. చౌట్‌పల్లి బీసీ హాస్టల్ సమీపంలో మురికి కాలువలో విద్యుత్ స్తంభం వేయడం వల్ల కాలువలో చెత్త చెదారంతో పాటు, మురికి నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వార్డెన్ మనోహర్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఏఎంసీ చైర్మన్ గుస్సేర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్, ఎంపీడీఓ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా ప్రకృతి వనం



పట్టణ ప్రకృతి వనంలో అసంపూర్తిగా వాకింగ్ ట్రాక్



వాకింగ్ ట్రాక్‌పై పేరుకుపోయిన చెత్త

- కనీస వసతులు కరువు
- ఇబ్బందులు పడుతున్న వాకర్స్
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్‌సిటీ: నగరంలోని పట్టణ ప్రకృతి వనంలో పరిసరాలు అధ్వానంగా మారాయి. పార్కులో ఎక్కడ చూసినా చెత్త చెదారంతో నిండిపోయింది. కనీసం వారంలో ఒక్కరోజైనా పారిశుధ్య పనులు నిర్వహించక పోవటంతో ప్రకృతి వనం రూపు కోల్పోతోంది. న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో అనేక సంవత్సరాలుగా పార్కు స్థలం నిరుపయోగంగా ఉండటంతో రెండేళ్ల క్రితం పట్టణ ప్రకృతి వనం పనులు ప్రారంభించారు. పార్కులో సేద తీరేందుకు పగోడి నిర్మాణం ఒక్కటే పూర్తిగా కాగా, వాకింగ్ ట్రాక్ నిర్మాణం మధ్యలోనే వదలిపెట్టారు. అలాగే గ్రీనరీ పనులు పూర్తికాలేదు. పార్కులో చిన్న పిల్లలు ఆడుకునే వస్తువులు, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయటంతో ప్రజలు ఇక్కడకు వస్తున్నారు. అయితే పార్కులో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాకింగ్ ట్రాక్ పూర్తి కాకపోవడంతో ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వచ్చే వారు అవస్థలు పడుతున్నారు. పార్కులో అసంపూర్తి పనులను పూర్తి చేసి, వసతులు కల్పించాలని నగరవాసులు కోరుతున్నారు.

వాకింగ్ ట్రాక్ పూర్తి చేయాలి



పార్కులో వాకింగ్ ట్రాక్ పనులు 90 శాతం పూర్తి చేసి పార్కు ప్రధాన గేట్ ముందర వదలిపెట్టారు. దీనివల్ల వాకింగ్ చేసే సమయంలో ఇబ్బందిగా ఉంది. అలాగే వాకింగ్ ట్రాక్‌పై నెలల తరబడి చెత్త పేరుకుపోయింది. దీనిని తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది ఎవరూ ఇటువైపు రావటంలేదు. వెంటనే చెత్తాచెదారాన్ని తొలగించాలి.

– గంగారెడ్డి, స్థానికుడు

గ్రీనరీ పనులు చేపట్టాలి



పార్కులో ఓపెన్ జిమ్, చిన్నపిల్లలు ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేయటం బాగానే ఉంది. కానీ గ్రీనరీ పనులు పూర్తి చేయలేదు. మంచి ఔషధ మొక్కలు నాటారు. కానీ గ్రీన్ గ్రాస్ పర్చలేదు. పార్కులో పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి.

– శంకర్, స్థానికుడు

పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో, వైద్యులు



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన

మోపాల్: పాఠశాలల్లో పరిసరాలు శుభ్రంగా ఉండేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన సూచించారు. విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో శుక్రవారం నగర శివారులోని బోర్గాం(పి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను వైద్య బృందం పరిశీలించింది. పాఠశాల పరిసరాలతోపాటు వంట గది, కూరగాయలు, తాగునీరు, వాటర్ ట్యాంకును పరిశీలించారు. వంటకు తాజా కూరగాయలు వినియోగించాలని, వాటర్ ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందికి ఆమె సూచించారు. ఆస్పత్రిలో చేరిన 16 మంది డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థులకు నాణ్యమైన సరుకులు, కూరగాయలతో భోజనం వడ్డించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆమె వెంట వైద్యులు రాజేష్, ఆశిష్ రాజ్, సంతోష్‌కుమార్, ప్రతినిధులు వెంకటేష్, నారాయణ, ముదక్‌పల్లి, బోర్గాం(పి) పీహెచ్‌సీ, హెచ్‌డబ్ల్యూసీ సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

నాణ్యమైన భోజనానికి కృషి

ప్రభుత్వ పాఠశాలల్లో, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఎన్‌ఎస్‌యూఐ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు వరద బట్టు వేణురాజ్ తెలిపారు. శుక్రవారం బోర్గాం(పి) ప్రైమరీ, ఉన్నత పాఠశాలను ఎంఈవో రామారావుతో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం వేణురాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కొందరు నాసిరకమైన సరుకులతో భోజనాలు వడ్డించేవారని గుర్తుచేశారు. తద్వారా విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితి రాదని, నాణ్యమైన భోజనంతోపాటు నిర్వాహకులకు బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎక్కడైనా నాసిరకం భోజనం వడ్డిస్తే ఎన్‌ఎస్‌యూఐ నాయకుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ఈ విషయంలో త్వరలోనే కలెక్టర్, విద్యాశాఖ అధికారులను కలిసి విన్నవిస్తామని తెలిపారు. నాయకులు సాయికిరణ్, శివ, నిఖిల్ రెడ్డి, ఇర్ఫాన్, హరీష్, చింటు, ప్రదీప్ ఉన్నారు.

'డబుల్' ఇళ్లకు కరెంట్ కష్టాలు

- ఇందల్వాయిలో కనెక్షన్ ఇవ్వని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు




ఇందల్వాయిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

ఇందల్వాయి: డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందుకున్న లబ్ధిదారుల ఆశలు ఆదిలోనే అడియాసలయ్యాయి. ఎన్నో ఆశలతో ఇంట్లోకి ప్రవేశించిన లబ్ధిదారులు ఇళ్లకు కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇందల్వాయిలో 30.14 కోట్ల రూపాయలతో 48 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించారు. ఎన్నో ఆటంకాల అనంతరం వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు.పంపిణీ చేసి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వాటికి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వలేదు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోటారు పని చేయక నీటి సరఫరా కూడా జరగడం లేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి కోసం నిత్యం అనేక తిప్పలు పడుతున్నామని, రాత్రి వేళల్లో చార్జింగ్ లైట్లు, బ్యాటరి బల్బులు వాడుతున్నట్లు తెలిపారు. ఇళ్ల సముదాయం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో అభద్రతకు లోనవుతున్నట్లు తెలిపారు.

పట్టించుకోని అధికారులు

రెండు నెలలుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. స్థానిక విద్యుత్ అధికారులను అడిగితే పైస్థాయిలో సమస్య ఉందని తీరడానికి కొంత కాలం పడుతుందని తెలిపినట్లు లబ్ధిదారులు వాపోతున్నారు.

కష్టాలు పడుతున్నాం



మాకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో కరెంట్ సౌకర్యం లేదు. దీంతో నీటి సరఫరా కూడా కావడం లేదు. పైన పోర్షన్‌లలో ఉన్నవారు నీటిని పైకి తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు.రాత్రి వేళల్లో అంధకారంలో గడుపుతూ చాలా ఇబ్బందులు పడుతున్నాం. – విజయలక్ష్మి, ఇందల్వాయి

రూ.ఆరు లక్షలు రావాల్సి ఉంది

గృహ నిర్మాణాలు చేపట్టిన ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి విద్యుత్ శాఖకు సుమారు రూ.ఆరు లక్షలు రావాల్సి ఉంది. వారు చెల్లింపు ప్రక్రియ పూర్తి చేసిన ట్రెజరి డిపార్ట్‌మెంట్‌లో నిధులు నిలిచిపోయాయి. మా సంస్థ ఖాతాలో డబ్బులు జమ కాగానే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విద్యుత్ అందించే పనులు ప్రారంభిస్తాం.త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

– పండరినాథ్, విద్యుత్ శాఖ ఏఈ, ఇందల్వాయి

నాయకులు ఓ వైపు.. ఓట్లు మరోవైపు

- ప్రధాన పార్టీ నేతల ఊళ్లల్లో ప్రత్యర్థి పార్టీలకు ఆధిక్యం..
- కంగుతిన్న అభ్యర్థులు, ముఖ్య నాయకులు

మోపాల్: అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు, ముఖ్య నాయకుల ఊళ్లల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారు. బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులైన బాజిరెడ్డి గోవర్ధన్, దినేష్ కులాచారి సొంతూర్లలో ఇతర పార్టీలకు ఆధిక్యం వచ్చింది. వీరితోపాటు ముఖ్య నాయకుల ఊళ్లల్లోనూ ప్రజలు ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు అధికంగా ఓట్లు వేసి కంగు తినిపించారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి సొంతూరు జలాల్‌పూర్‌లో 208 ఓట్లు ఆయనకు లీడ్ వచ్చింది. అలాగే మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకులు మండవ వెంకటేశ్వర్‌రావు స్వగ్రామమైన ధర్మారం (బి)లో 872 ఓట్లు, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ గ్రామమైన సిరికొండలో 688 ఓట్లు కాంగ్రెస్ పార్టీ ఆధిక్యాన్ని కనబర్చింది. పీసీసీ ప్రధాన కార్యదర్శి కాట్‌పల్లి నగేష్‌రెడ్డి గ్రామం ముల్లంగి (ఐ)లో కాంగ్రెస్‌కు కేవలం 17 ఓట్లు ఆధిక్యం రాగా, బీఆర్‌ఎస్ మూడోస్థానంలో నిలిచింది.

- బాజిరెడ్డి గోవర్ధన్ స్వగ్రామమైన రావుట్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ ఆర్ భూపతిరెడ్డికి 162 ఓట్లు అధికంగా వచ్చాయి. బీజేపీ మూడోస్థానంలో సరిపెట్టుకుంది.
- బీజేపీ అభ్యర్థి దినేష్ కులాచారి స్వగ్రామమైన అమృతాపూర్‌లో బీఆర్‌ఎస్ ఆధిక్యాన్ని కనబర్చింది. 176 ఓట్లు బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు అధికంగా వచ్చాయి. దినేష్ కులాచారి రెండోస్థానానికి పరిమితం అయ్యారు.
- మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నాయకులు అరికెల నర్సారెడ్డి సొంతూరు సింగంపల్లిలో 8 ఓట్లతో బీఆర్‌ఎస్ అభ్యర్థి ముందంజలో ఉన్నారు. 345 ఓట్లు బీఆర్‌ఎస్‌కు రాగా, ఆ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డికి 337, బీజేపీ అభ్యర్థి దినేష్ కులాచారికి 300 ఓట్లు వచ్చాయి.
- మాజీ ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీజీ గౌడ్ స్వగ్రామమైన రాంపూర్‌లో బీజేపీ ఆధిక్యాన్ని కనబర్చింది. 257 ఓట్లు బీజేపీకి లీడ్ వచ్చింది. 1340 ఓట్లు బీజేపీకి రాగా, ఆ గ్రామంలో బీఆర్‌ఎస్‌కు 1083 ఓట్లు, కాంగ్రెస్‌కు 819 ఓట్లు వచ్చాయి.
- నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి గ్రామం బోర్గాం(పి)లో బీజేపీకి 145 ఓట్లు అధికంగా వచ్చాయి. బీఆర్‌ఎస్ 1385 ఓట్లతో మూడోస్థానంలో సరిపెట్టుకుంది. బీజేపీకి 1906 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 1761 ఓట్లు వచ్చి రెండోస్థానంలో నిలిచింది.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న కళ్యాణ్

నిజామాబాద్ అర్బన్: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీజీవీపీ (తెలంగాణ విద్యార్థి పరిషత్)జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్, నగర అధ్యక్షుడు అఖిల్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ..రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 5300కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తెలంగాణ యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలని కోరారు. ఈ సమావేశంలో అఖిల్, సోహెల్, మహేష్, సుజిత్, అమన్, చందు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలి

నిజామాబాద్‌అర్బన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం చొరవ చూపాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో నిరాదరణకు గురైన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు.

స్తంభానికి కర్రలే ఆధారం



సిరికొండ:మండల కేంద్రంలోని పొలాల్లో విద్యుత్ స్తంభం పూర్తిగా వంగిపోయింది. స్తంభం పడిపోకుండా ఉండేందుకు ఆ పొలానికి చెందిన రైతు కర్రలను ఆధారంగా ఉంచాడు. అధికారులు స్పందించి వంగిన స్తంభాలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	62,750	వెండి (కిలో)	77,500
22 క్యారెట్స్	57,858	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సిడ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	750

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	50	75	పచ్చిమిర్చి	30	50
బీరకాయ	50	75	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	15	30
బీర్నిసుకాయ	70	100	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	40	60	కరివేపాకు	60	80
మెంతికూర	30	50	చామగడ్డ	30	50
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	50	80	చిక్కుడుకాయ	30	50
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2 ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)-10.00, 4.45, 7.35
యానిమల్(తెలుగు)-1.00
యానిమల్(హిందీ)-10.35

స్క్రీన్-3 హాయ్ నాన్న -10.10,1.05, 7.45,
యానిమల్(హిందీ)- 4.00
ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)-10.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 ఎక్స్ట్రాఆర్డినరీమెన్(తెలుగు) -12.00,3.20,6.40, 10.00

స్క్రీన్-2 -యానిమల్(హిందీ)-10.00,2.00 6.00,10.00
యానిమల్(తెలుగు)-2.00

స్క్రీన్-3 ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్-(తెలుగు)-10.10
వంకా(ఇంగ్లీష్)-1.30,7.25,10.10
సామ్ బహదూర్(హిందీ)-4.15

స్క్రీన్-4 యానిమల్(తెలుగు)-11.15,6.30
హాయ్‌నాన్న(తెలుగు)-3.15, 10.30

దేవి హాయ్ నాన్న(తెలుగు)

నటరాజ్ యానిమల్(హిందీ)

లలితామహల్ యానిమల్(తెలుగు)

విజయ్ ఎక్స్ట్రా ఆర్డినరీ మెన్(తెలుగు)


ఘనంగా అయ్యప్ప పడిపూజ

నందిపేట్: నందిపేటలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో గురుస్వామి మాడ మల్లేష్ స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం మహా మండల పడి పూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గూడేం గురుస్వామి, శ్రీ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు మహా అభిషేకం చేపట్టారు. అనంతరం జ్యోతులను వెలుగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గురుస్వాములను మల్లేష్ స్వామి సన్మానించారు.



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న మాలధారులు

నూతన ప్రభుత్వానికి అభినందనలు



ఖలీల్‌వాడి: నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఎం జిల్లా కమిటీ పక్షాన అభినందనలు తెలుపుతున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో వివిధ సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి తెలియజేయాలని పార్టీ సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరించటంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను అమలు జరపడంతో పాటు ప్రజా హక్కులను కాపాడాలని ఆయన కోరారు. ఆరు గ్యారంటీలను అమలు జరపాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కరించని ఎడల కొంతకాలం వేచి చూసిన తర్వాత పోరాటాలు చేస్తామన్నారు. పెద్ది వెంకట్ రాములు, పల్లపు వెంకటేష్, జై శంకర్ గౌడ్, గంగాధర్, నూర్జహాన్ పాల్గొన్నారు.